క్లుప్తంగా

బీటీ రోడ్డుకు రూ.2.3 కోట్లు మంజూరు

తెర్లాం: మండలంలోని అంట్లవార గ్రామం నుంచి లింగాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.3 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. అదే గ్రామంలో గతేడాది విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన కోట రామారావు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును ఆయన సోమవారం అందజేశారు. నిరుపేదలను ఆదుకునేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామ బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి, టెండర్ పనులు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట బుడా చైర్మన్ తెంటు లక్ష్మోనాయుడు, ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.

బాడంగి: స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న మరడాన వారి కల్లంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎమ్మెల్యే బేబీనాయన సమకూర్చిన రూ.30 వేలను సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా సోమవారం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: మండల కేంద్రంలోని ఐటీఐలో ఉచిత కంప్యూటర్, ఎలక్ట్రికల్ కోర్సులు చేసేందుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వెబ్ డెవలపర్ కంప్యూటర్ కోర్సు, పీవీ ఇన్‌స్టాలర్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో ఈ నెల 10వ తేదీలోగా ఐటీఐలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7286042743, 8121450657ను సంప్రదించాలని కోరారు.

20న దేశవ్యాప్త సమ్మె



సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

బొబ్బిలి: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు లంక శాంతమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) వైద్య సిబ్బందికి సోమవారం సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. అనంతరం ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు తీర్చాలని నిరసన చేపట్టారు.

రాజాం సిటీ: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక నేత సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. స్థానిక వైఎస్సార్ పార్కు ఆవరణలో కార్మికులతో సోమవారం సమావేశమైన ఆయన.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక, కర్షకుల హక్కులపై దాడి చేసే చర్యలు ఆపాలని లేకపోతే ప్రజల ఉద్యాసనకు గురవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని, కనీస వేనతం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.

బీజామృతంతో విత్తన శుద్ధి మేలు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకుని వేసుకోవడం ద్వారా మేలు ఉంటుందని ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలోని రైతులకు బీజామృతంతో విత్తనశుద్ధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా బీజామృతంతో విత్తనాలు చేసుకుని విత్తుకోవడం ద్వారా తెగుళ్లను తట్టుకునే పంట పొందగలమన్నారు. మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణలు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే తనిఖీ

తెర్లాం: మండల కేంద్రంలో జరుగుతున్న భూముల రీసర్వేను మండల సర్వేయర్ సాయి సోమవారం తనిఖీ చేశారు. సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌వోలు కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి ఈ రీసర్వే చేస్తుండగా, మండల సర్వేయర్ ఒక్కో బృందం వద్దకు వెళ్లి వారు చేస్తున్న సర్వే విధానం చూసి పలు సూచనలు చేశారు. సర్వేలో తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను వేగవంతం చేయాలని కోరారు.

కంచె అపహరణపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లికి చెందిన తూలుగు రమణమూర్తి ఖాళీ స్థలంలో వేసిన కంచె అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు సోమవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తమ కంచె దొంగిలించినట్లు బాధితుడు రమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఊరెళ్తున్నారా.. ఊడ్చేస్తారు.. జాగ్రత్త!



- తాళాలు వేసిన ఇళ్లు లక్ష్యంగా చోరీలు
- వేసవిలో పేట్రేగిపోతున్న దొంగలు
- సెలవుల్లో ఎక్కడికైనా వెళ్తే తస్మాత్..
- భద్రత కోసం పోలీసులకు సమాచారమివ్వాలి



రాజాంలోని వాసవీనగర్‌లో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు(ఫైల్)

రాజాం సిటీ: పెళ్లిళ్లు, పండగలకు అని ఊరెళ్తున్నారా.. వేసవి సెలవులు కదా అని విహారయాత్రలకు బయలుదేరారా అయితే తస్మాత్ జాగ్రత్త. ఎవరూ లేని ఇంట్లో దొంగలు పడి చిల్లిగవ్వ లేకుండా మొత్తం ఊడ్చేస్తారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా తాళం వేసిన ప్రతి ఇంట్లో దొంగతనాలు చేసేస్తున్నారు. చేతికి దొరికినది, కంటికి కనిపించినదంతా పట్టుకెళ్లిపోతున్నారు. పిల్ల పెళ్లికని, పిల్లల చదువుకని దాచుకున్న బంగారం, డబ్బు మాయమవ్వకముందే జాగ్రత్త పడండి. ఎక్కడికైనా వెళ్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వండి. మీ ఇంటికి భద్రత పెంచుకోండి.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- ఈ ఏడాది ఏప్రిల్ 12న పొగిరి గ్రామానికి చెందిన జడ్డు చిన్నమ్మడు కళ్లంలో ఆవులకు మేత వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి కళ్లల్లో కారం కొట్టి మెడలో పుస్తెలతాడు అపహరించుకుపోయాడు.
- గతేడాది డిసెంబర్ 13న రాజాం పట్టణ పరిధిలోని ఈశ్వరనారాయణ కాలనీకి చెందిన అమర సత్యనారాయణ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాలోని 13 తులాల బంగారం అపహరించుకుపోయారు.

అలాగే పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ గేటు ఎదురుగా లక్ష్మీనగర్‌లో సలాది శేషగిరి కుటుంబంతో సహా పెళ్లికి వెళ్లారు. ఇంటికి తాళం వేసిన విషయం గుర్తించిన దొంగలు గతేడాది నవంబర్ 2న ఇంట్లో చొరబడి 27 తులాల బంగారం పట్టుకుపోయారు.

సీసీ కెమెరాలతో నియంత్రణ..

ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వారు ఎక్కువగా ఇతర ఊర్లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వేసవి విడిది కేంద్రాలకు వెళ్తుంటారు. ఏటా ఈ సమయాల్లోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతేకాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరుబయట నిద్రించే వారి ఇళ్లల్లోనూ దొంగలు దొంగతనాలు చేస్తున్నారు. ఆభరణాలు, డబ్బు ఎత్తుకుపోతున్నారు. దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు ఇళ్ల వద్ద వీధుల్లో సీసీ కెమెరాలు చేసుకుంటే మంచిదని చెబుతున్నారు. సీసీ కెమెరాల ద్వారా చోరీలను నియంత్రించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలి..

వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలి. వేసవిలో ఉక్కపోత కారణంగా ఆరుబయట, డాబాలపై నిద్రించేందుకు చాలామంది ఆసక్తి చూపుతారు. ఇటువంటి వారు తమ ఇళ్లల్లోని బంగారు ఆభరణాలను వేసవికాలం ఉన్నంతవరకు బ్యాంకుల్లో భద్రపరుచుకుంటే మంచిది. అలాగే రాత్రిపూట వీధుల్లో గస్తీ కాసే పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలి. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వారికి తెలియజేయాలి. యువత కూడా అప్రమత్తంగా వ్యవహరించాలి, చోరీల నియంత్రణకు పాటుపడాలి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ అమలయ్యేనా?

ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం)పై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పూర్తి స్థాయిలో ఇది అమలు కావడం లేదు. ఈ విధానం అమల్లోకి వస్తే దొంగతనాలను సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి వివరాలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందురోజు ఆరు అంకెల కోడ్‌తో పోలీసు రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమల్లోకి వస్తే నమోదు చేసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికాలను అమర్చుతారు. దీంతో ఇళ్లు పోలీసుల కంట్రోల్‌లోకి వెళ్తుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో ఆగంతకులు ప్రవేశిస్తే నేరుగా పోలీసు కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుని, దొంగలను పట్టుకునేందుకు వీలుంటుంది. ఈ విధంగా ఇంటికి భద్రత ఏర్పరచడంతో పాటు దొంగతనాల నివారణ చేయొచ్చు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి..



ప్రజలంతా ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్)ను సద్వినియోగం చేసుకోవాలి. క్యాంపులు వెళ్లే వారు ఆభరణాలను ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారి ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు పర్యవేక్షణ చేస్తాం. ఉచితంగా ఈ సేవలు పొందవచ్చు.

–ఎస్.రాఘవులు, డీఎస్పీ, చీపురుపల్లి

అవగాహన కల్పిస్తున్నాం..



పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడికైనా ఎక్కువ రోజుల పాటు ఉండేందుకు వెళితే సమాచారం తెలియజేయాలని సూచిస్తున్నాం. దొంగతనాలు, కొత్త వ్యక్తుల సంచారంపై ఎప్పటికప్పుడు చైతన్యం కల్పిస్తున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తూ సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్నాం.

–కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

జాగ్రత్తలు పాటించాలి..



వేసవి సెలవుల్లో ఊర్లు, విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విలువైన వస్తువులు దొంగలపాలవ్వకుండా పోలీసుల సూచనలు పాటించాలి. అలాగే ప్రయాణాలు చేసేటప్పుడు బ్యాగులు, సూట్‌కేసులు తమ వద్దే ఉంచుకోవాలి.

–హెచ్.ఉపేంద్రరావు, సీఐ, రాజాం రూరల్

పోలీస్ క్వార్టర్స్ స్థలం సర్వే

- 20 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తింపు



సర్వే ద్వారా హద్దులు గుర్తిస్తున్న సర్వేయర్లు, సీఐ నారాయణరావు

రామభద్రపురం: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయానికి అనుకుని 2002లో పోలీస్ క్వార్టర్స్ నిమిత్తం ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని సోమవారం సర్వే చేశారు. వార్షిక తనిఖీల నిమిత్తం ఇటీవల రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఐజీకి పోలీసులకు ప్రభుత్వం కేటాయించిన స్థలం ఉన్నట్లు తెలిసింది. ఎన్నాళ్ల నుంచో ఖాళీగా ఉండడంతో ఆ స్థలం ఆక్రమణకు గురై ఉంటుందేమోనన్న అనుమానంతో ఎస్పీ ద్వారా సర్వే చేయించాలని సీఐ నారాయణరావును ఆదేశించారు. సర్వే నంబరు 191లోని 1.28 ఎకరాల స్థలంలో 20 సెంట్లు వరకు ఆక్రమణకు గురైనట్లు సర్వేయర్లు గుర్తించారు. ఈ ఆక్రమిత ప్రదేశంలో ఆలయానికి సంబంధించిన దుకాణాలు ఉన్నట్లు తేలింది. ఇదే విషయంపై ఆలయ నిర్వాహకులను ఆరాతీయగా, రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలంలోనే ఆలయ నిర్మాణం, దుకాణాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఆలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన స్థలం అనుమతిపత్రాలు తీసుకురావాలని సీఐ కోరారు. ఆలయ స్థలానికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలు తేకుండా ఆలయం నిర్మాణానికి గీసిన ప్లాన్, పంచాయతీ ఇచ్చిన అప్రూవల్ పత్రాలు తెచ్చారు. ఈ పత్రాలు సరిపోవని, రెవెన్యూ అధికారులు ఇచ్చిన పత్రాలే తేవాలని సీఐ తెలిపారు. ఒకవేళ రెవెన్యూ అధికారులు ఇచ్చిన పత్రాలు లేకపోతే పోలీసుల స్థలం ఆక్రమించినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని సీఐ స్పష్టం చేశారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ అప్పారావు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇటీవల గాలివాన బీభత్సానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు(బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం)లో వరి, చెరకు, మొక్కజొన్న, అరటి, మామిడి పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. ఆఖరికి కల్లాల్లో ఉంచిన వ్యవసాయ పంటలు కూడా పూర్తిగా తడిసిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. అలాగే రైతులు తమ పంటలు విక్రయించేటప్పుడు తక్కువ ధర.. వినియోగదారులు కొనేటప్పుడు ఎక్కువ ధర ఉంటోందన్నారు. రైతు పంట విక్రయంలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, మద్దతు ధర కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు దాడితల్లి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నడిమింటి సత్యంనాయుడు, బొబ్బిలి మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

రాజాం సిటీ: విద్యార్థులంతా చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని శ్రీయోగా వికాస్ శిక్షణా కేంద్రంలో గత పది రోజులుగా భగవద్గీత, నీతి కథలు, పబ్లిక్ స్పీకింగ్, యోగా, ధ్యానంపై అందిస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యోగా వికాస్ నిర్వాహకులు కె. సౌందర్య, డాక్టర్ ఎస్.శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళల పేరిట కూటమి దోపిడీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేగిడి: బీసీ మహిళల పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీకి తెరలేపిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలో లక్ష మంది బీసీ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ, శిక్షణ కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించి, కూటమి పార్టీల అనుకూల కాంట్రాక్టర్ల ద్వారా భారీ దోపిడీకి పన్నాగం పన్నుతోందని ఆరోపించారు. ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.27 వేలు కేటాయించిందని, ఇందులో కుట్టుమిషన్ రూ.4,300లు కాగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వారికి శిక్షణ నిమిత్తం రూ.3 వేలు కేటాయించిందన్నారు. ఈ లెక్క ప్రకారం రూ.7,300లు వాస్తవ ఖర్చు అవుతున్నప్పటికీ మిగిలిన సొమ్మును దోచుకుని, పంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పి, కేవలం 50 నియోజకవర్గాల్లో మాత్రమే అరకొరగా ఏర్పాటు చేశారన్నారు. శిక్షణా కేంద్రాల్లో శిక్షకులు లేరు, శిక్షణ పేరుతో సంబంధిత కాంట్రాక్టర్ దోచుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ప్రైవేటు భవనంలో శిక్షణ ఇస్తున్నామని చెప్పి ప్రభుత్వ భవనాల్లో నడిపిస్తున్నారని, ప్రజాధనాన్ని కాపాడడానికి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ విభాగం పోరాటం చేస్తుందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకుడు కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



బాడంగి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు ప్రదర్శిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

వంగర: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసి, ప్రకృతి సాగు పద్ధతులు అవలంబిస్తూ పండించి కూరగాయలు, ఆకుకూరలను విక్రయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల ద్వారా పండించే ఆహార ధాన్యాలు, కూరగాయలు తింటే అనారోగ్యమని, మంచి ఆరోగ్యానికి ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలను తినాలన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ స్టాల్ సోమవారం ఏర్పాటు చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు విక్రయించగా, వాటిని కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేసి ప్రకృతి సాగు పంటల వినియోగాన్ని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక వెలుగు కార్యాలయంలో ముగడ, కోడూరు, పిండ్రంగివలస, గొల్లాది, ఆకులకట్ట గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ కూరగాయలు సాగు చేయడంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఉద్యానశాఖాధికారి మోహనరావు ప్రకృతి సాగు ద్వారా కూరగాయలు పండించే పద్ధతులను వివరించారు.

25 శాతం సీట్లకు 19 వరకు గడువు

రాజాం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఉందని ఎంఈవో వై.దుర్గారావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. అర్హులైన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయాలు, మీసేవ కేంద్రాలు, ఇంటర్నెట్ సెంటర్లను సంప్రదించి గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నిరసన



ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) నాయకులు కె.శ్రీను, కె.సింహాచలం, హరికృష్ణ తదితరులంతా బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ప్రాథమిక విద్యకు విఘాతం కలిగిస్తూ 1, 2 తరగతులతో ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇదే జరిగితే విద్యార్థులు నష్టపోతారన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలగా ఉంచాలన్నారు. జనాభా ప్రాతిపదికన పాఠశాలలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధానోపాధ్యాయుడు, పీడీ(ఫిజికల్ డైరెక్టర్) పోస్టులు మంజూరు చేయాలని, అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు మీడియం ఉండాలని డిమాండ్ చేశారు.

–బొబ్బిలిరూరల్

ఆశవర్కర్ల సమస్యలపై దేశవ్యాప్త సమ్మె



బొబ్బిలి మండలం, పిరిడి గ్రామ పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీకి సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు, ఆశవర్కర్ల సంఘం ప్రతినిధి రాధ సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు అనుమతి ఇవ్వాలని కోరారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే లేబర్ కోడ్ రద్దు చేసి, కార్మికులకు చట్టబద్ధమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

–బొబ్బిలిరూరల్

రేషన్ కష్టాలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. కొండంపేట, వస్త్రపురికాలనీ వాసులు సోమవారం రెండు కిలోమీటర్ల దూరంలోని రాజాం పట్టణం బొబ్బిలి రోడ్డులోని మల్లయ్యపేట డిపో వద్ద క్యూకట్టారు. గంటల తరబడి నిరీక్షించి రేషన్ సరుకులు తీసుకున్నారు. గతంలో ఇంటివద్దకే వచ్చి సరుకులు అందజేసేవారని, ఇప్పుడు కష్టాలు తప్పడంలేదని వాపోయారు. ఎండీయూ ఆపరేటర్ మానేయడంతో సమస్య వచ్చిందని, మరొకరి నియామకానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని సీఎస్‌డీటీ చిరంజీవిరావు తెలిపారు.

– రాజాం సిటీ

సంక్షిప్తంగా...

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 35 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

రేగిడి: మండలంలోని వండానపేటలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, శిబిరానికి హాజరైన రోగులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రోహిణీరాఘవ్ తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

జోరుగా ఉపాధి పనులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, తోకలవలస, లచ్చన్నవలస గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఆయా గ్రామాల పొలాలకు తోటపల్లి రిజర్వాయరు ద్వారా సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా సాగునీటి కాలువల్లో పనులు చేస్తున్నారు. ఈ పనులతో ఇటు వేతనదారులకు అటు రైతులకు ఉపయుక్తమని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు.

ప్రత్యేక తరగతుల తనిఖీ

తెర్లాం: పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను సప్లిమెంటర్ పరీక్షలకు సిద్ధం చేస్తూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంఈవో త్రినాధరావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు.

బొబ్బిలిలో పండగ సందడి

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు దాడితల్లి ఉత్సవాలు పురస్కరించుకుని, బొబ్బిలిలో పండగ సందడి నెలకొంది. గొల్లపల్లిలో మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో తొలిరోజు అయిన సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం చేపట్టనున్నారు. అమ్మవారి దర్శనానికి ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తుండడంతో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఐవీఆర్ఎస్‌పై పునరాలోచించాలి

సంతకవిటి: ఐవీఆర్ఎస్ విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల డెమొక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి కిరణ్‌కుమార్ అన్నారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులకే నేరుగా ఫోన్ కాల్స్ ద్వారా పథకం వలన ప్రయోజనం, సచివాలయ సిబ్బంది సేవల్లో నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ సేకరణకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కొంతమంది లబ్ధిదారులు తెలియక ఐవీఆర్ఎస్‌లో 1ని నొక్కి సచివాలయ సిబ్బంది సేవలపై తప్పుడు ఫిర్యాదులు చేయడం జరుగుతోందన్నారు. తక్షణమే ఈ విధానాన్ని విరమించుకునేలా పునరాలోచన చేయాలని కోరారు.